ప్రతాప రవిశంకర్



సెలవు కాదు. వంట్లో బావున్నట్లని పించక ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టి వరండాలో పేము కుర్చీలో కూర్చుని ఇంగ్లీషు నవల చదువుతున్నాను. మాంచి సస్పెన్స్‌లో వుండగా గేటు నెట్టిన చప్పుడు వినిపించింది.

తలెత్తి చూశాను. చిరునవ్వుతో లోపలికి వస్తున్న పోస్ట్‌మేన్ కనిపించాడు. దగ్గరకు రాగానే చేతిలోవున్న ఉత్తరాల కట్టలోనించి ఓ కవరు తీసి నా చేతిలో వుంచి వెళ్ళిపోయేడు.

కవరు చించాను.

చెల్లెలు హైమవతికి –

నీ అన్నయ్య గోవర్ధనం వ్రాయు

నది. నాకు తెనాలికి ట్రాన్స్ఫరయింది. రెండ్రోజుల్లో జాయినవ్వాలి. నిన్ను చూసి చాలారోజు లయింది. బావగారిని ఇంతవరకు చూడలేదు. అందుకే ఇద్దరినీ చూసినట్లవుతుందని రేపు విజయవాడలో దిగి మీ ఇంటికి వస్తాను మీ వదిన పురిటికి పుట్టింటికి వెళ్లిపోయింది.

— గోవర్ధనం

ఆ ఉత్తరం చదివిన తర్వాత కొంత సేపు ఆలోచనలో పడవలసి వచ్చింది. నాకు తెలిసినంతలో నా భార్య హైమవతికి అన్నయ్యలు ఎవరూ లేరు. బహుశ ఏ కజినో అయివుంటా డనుకున్నాను. పాపం – అత నింతగా తన చెల్లెలికి ఉత్తరం రాస్తే హైమవతి ఇక్కడ లేదు. మా అత్తగారికి ఏదో జబ్బు చేసిందని ఉత్తరం రాగా రెండ్రోజుల క్రితమే వెళ్ళిపోయింది.

ఎందుకో నా చేతిలో ఉన్న ఉత్తరాన్ని మరోసారి చదవా లనిపించింది. మళ్ళీ చదువుతుంటే ఆ దస్తూరి నాకు సుపరిచితమే ననిపించింది. ఎప్పుడో, ఎక్కడో అటువంటి చేతివ్రాతను చూశాను. చాలా ఆర్టిస్టిక్‌గా వున్నాయి అక్షరాలు. ఆ దస్తూరిని ఎక్కడ చూశానో గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నించాను. ఐదు నిమిషాల తర్వాత హఠాత్తుగా నా కళ్ళముందు మంగపతి పెళ్ళినాటి సంఘటన కదిలింది.

అవును. సరిగ్గా ఏడాది క్రితం ఓ పల్లెటూరికి నా స్నేహితుడు మంగపతి పెళ్ళికి వెళ్ళాను పెళ్లికూతురు తరఫువాళ్లే ఎక్కువమంది వచ్చారు. అంతా కోలాహలంగా వుంది. మంగపతి హడావిడిగా తిరుగుతున్నాడు. పెళ్ళికూతురు డిగ్రీ వరకు చదువుకున్నదనీ, అందంగా వుంటుందనీ చెప్పాడు. నేను చూశాను. అతని మాటలు నిజమే.

ఇంకా మంగళసూత్రధారణ జరక్క ముందే ఆ పెళ్ళి పందిట్లో ఓ బాంబు పేలింది. మంగపతి పేర ఓ ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చదివి అక్కడే పడబోయాడు మంగపతి. అతన్ని పట్టుకుని ఆ ఉత్తరం చదివాను. ఇంతే ముంది ? ఆ ఉత్తరంలో పెళ్ళికూతురు ఇంతకుముందు ఎవర్నో ప్రేమించిందనీ, మంగపతిని చేసుకోడం ఆ అమ్మాయికి సుతరామూ ఇష్టం లేదనీ బలవంతంగా మంగపతి మామగారు కూతురి పెళ్ళి చేస్తున్నాడనీ వుంది. పెళ్ళికి వచ్చిన మరికొందరు పెద్దలు కూడా ఆ ఉత్తరాన్ని చదివారు. పెళ్ళికూతురికి ఆ పెళ్ళి ఇష్టంలేదని తేల్చారు. మంగపతి పెళ్లి ఆగిపోయింది ఇంతకీ నేను చూసిన దస్తూరి ఆ ఉత్తరం లోనిదే. మంగపతి పెళ్ళిరోజు వచ్చిన ఉత్తరంలో దస్తూరి, ఇప్పుడు నాకు వచ్చిన ఉత్తరంలోదస్తూరి ఒకటే ననిపించింది. అలా అనిపించగానే గోవర్ధనం మీద అనుమానం వచ్చింది. నా

అనుమానానికి నవ్వూ వచ్చింది...ఐనా ఈ గోవర్ధనమే ఆ ఉత్తరం రాసిన మనిషి ఎందుకు కాకూడదు ? అనిపించింది మనసులో. కాకతాళీయంగా జరిగివుండ వచ్చు. అందుకే గోవర్ధనం రాగానే ఎలాగైనా ఈ విషయం గురించి ఆరా తీద్దా మనుకున్నాను.

* * *

మరురోజు–

ఆదివారం. గోవర్ధనంకోసం ఎదురు చూస్తూ ఇంట్లోనే వున్నాను. ఉదయం పదిగంటలవుతుండగా ఇంటిముందు రిక్షా ఆగింది. ఆగిన రిక్షాలోనించి ఎయిర్ బ్యాగ్ పట్టుకుని ఓగాడు ఓ యువకుడు. అతనే గోవర్ధన మనుకు న్నాను.

లోపలకు వచ్చాడు. తనని పరిచయం చేసుకున్నాడు. నేనూ నన్ను పరిచయం చేసుకుని అతని ఉత్తరం చేరిందనీ హైమవతి పుట్టింటికి వెళ్ళిందనీ చెప్పాను. నా మాటలు విన్న తర్వాత కొంత నిరుత్సాహం అతనిలో కనపడింది.

తర్వాత ఇద్దరం కబుర్లలోకి దిగాము. తన ఉద్యోగం గురించి చెబుతున్నాడు గోవర్ధనం. అతని మాటలు చాలా తెలివిగా ఎదుటి మనిషిని ఆకట్టుకొనేట్టు వున్నాయి.

పదకొండు గంటల తర్వాత ఇద్దరం స్నానంచేసి హోటల్‌కు వెళ్ళి భోజనం చేసివచ్చాము. సాయంత్రం వరకు పేకాడుకొన్నాము. ఆ టు త ర్వా త గోవర్ధనం ఓ గంటసేపు నిద్ర పోయేడు.

నాకు నిద్రపట్టలేదు. నా మనసులో కదులుతున్న ఆలోచనలను గోవర్ధనం ముందు ఎలా బయటపెట్టాలని ఆలోచి స్తున్నాను. నే నిలా ఆలోచిస్తుండగానే అతను నిద్ర లేచాడు. ఐదున్నర దాటు తోంది,


డ్రెస్ చేసుకొని ఇంట్లోనించి బయట పడ్డాము. ఏవో విషయాలు మాట్లాడు కుంటూ కృష్ణా బ్యారేజి దగ్గరకు వెళ్లాము.

బాగా చీకటిపడిన తర్వాత వెనక్కి మళ్ళాము.

నడుస్తున్న వాడినల్లా "ఎందుకో నాకో సంఘటన గుర్తుకొస్తోంది" అన్నాను.

"ఏమిటది?" నాకేసి చూస్తూ ఆశ్చ ర్యంగా అడిగాడు గోవర్ధనం.


"ఏడాదిక్రితం నా స్నేహితుడు మంగపతి పెళ్ళికి ఓ పల్లెటూరు వెళ్ళాను. పెళ్ళిరోజు మంగపతి పేర్న ఓ ఉత్తరం వచ్చింది. అందులో పెళ్ళికూతురు ఎవర్నో ప్రేమించిందనీ,మంగపతిని చేసు కోడం ఆ అమ్మాయికి ఇష్టంలేదనీ వుంది. ఆ ఉత్తరం నేను చదివాను. నన్నెంత గానో ఆకర్షించింది. చాలా ఆర్టిస్టిక్‌గా వున్నాయి అక్షరాలు. ఆ ఉత్తరం



కారణంగా మంగపతి పెళ్లి ఆగిపోయింది. బహుశ ఆ అమ్మాయిని ప్రేమించి నతనే ఆ ఉత్తరం రాసివుండాలి. ఇప్పుడా అమ్మాయికి పెళ్లయిందో ? లేదో ? ఎందుకో నాకు అప్పుడప్పుడు ఆ సంఘటన గుర్తుకొస్తూవుంటుంది."

గోవర్ధనం మాట్లాడలేదు. నవ్వాడు. అతని ముఖంలో ఫీలింగ్స్‌ను గమనించాను. ఎలాంటి భావమూ కనిపించలేదు. బహుశ ఆ ఉత్తరం రాసింది గోవర్ధనం కాదేమో అనుకున్నాను అతనే రాయాలని ఏముంది ? మరెవరో అయివుండవచ్చును. ఎట్లాగో మనసును సరిపెట్టుకోవాలనుకున్నాను ఈసారి డైరెక్టుగా విషయంలోకి దిగిపోయేను

"ఈ సంఘటన గురించి సందర్భం లేకుండా మీతో ఎందుకు చెప్పానో తెలుసా ?" అడిగాను




"ఎందుకు ?"

"నిన్న మీరు రాసిన ఉత్తరంలో దస్తూరి. మంగపతి పెళ్లిరోజు వచ్చిన ఉత్తరంలో దస్తూరి ఒకటే "

నవ్వి "గ్రహించాను. ఆ ఉత్తరం నేనే రాశానేమోనని తెలుసుకుందామని ఈ సంఘటన చెప్పారు, అవునా" అన్నాడు గోవర్ధనం

తల వూపాను.

"మీ ఊహ నిజమే. ఆ ఉత్తరం నేనే రాశాను "

విస్తుబోయాను.

"నిజం. ఆ అమ్మాయిని ప్రేమించింది నేనే మే మిద్దరం పెళ్లిచేసుకుందామనుకున్నాం. కాని అప్పట్లో నాకు ఉద్యోగం లేకపోవడంవల్ల ఆ అమ్మాయి తండ్రి మా పెళ్లికి ఒప్పుకోలేదు. మరో సంబంధం చూసి పెళ్ళి నిశ్చయించాడు. వారికి ముందుగానే ఉత్తరం రాశాను. తర్వాత మరో సంబంధం చూశాడు. అదే మీ మంగపతిగారి సంబంధం. ఉత్తరం రాశాను. పెళ్లి ఆగిపోయింది. తర్వాత మరో సంబంధం కూడా చెడగొట్టేను. ఆ తర్వాత మరెవరూ ఆ అమ్మాయిని చేసుకుంటానంటూ రాలేదు. నాకు ఉద్యోగం వచ్చింది. నా కాళ్లే కడిగి కన్యాదానం చేశాడు. ఇప్పుడు ఆ అమ్మాయి నా భార్య. అంటూ స్ట్రీట్ లైటు దగ్గర ఆగి పర్సులో నించి ఓ ఫోటో తీసి చూపాడు. కళ్ళు పెద్దవిచేసి చూశాను.

గోవర్ధనం – పక్కనే ఆ అమ్మాయి. గుర్తుపట్టగలిగేను. ఆ అమ్మాయే మంగపతికి తప్పిపోయిన భార్య.